సాక్షి
జయశంకర్ భూపాలపల్లి
మంగళవారం । 17 । అక్టోబర్ । 2023



గంజాయి పట్టివేత

సినీఫక్కీలో తరలిస్తున్న ఎండు గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. వారి వద్దను నుంచి రూ.75 లక్షల విలువైన సరుకును స్వాధీనం చేసుకున్నారు.

- 10లో▸



సత్తా చాటిన తెలంగాణ అథ్లెట్లు

హనుమకొండలోని జేఎన్ఎస్‌లో నిర్వహిస్తున్న 34వ సౌత్‌జోన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌లో తెలంగాణ అథ్లెట్లు సత్తా చాటుతున్నారు. వివిధ విభాగాల్లో పతకాలు సాధించారు.

- 10లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
32.0^0 /24.0^0

జిల్లాలో ఉదయం మంచుకురుస్తుంది. మధ్యాహ్నం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. పలు చోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు కాళేశ్వరాలయంలో హోమం

కాళేశ్వరం: శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో మంగళవారం సామూహిక నవగ్రహ నక్షత్ర శాంతి, శ్రీదుర్గా హోమం నిర్వహిస్తున్నట్లు ఈఓ మహేష్, చైర్మన్ శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11గంటలకు రూ.1000 చెల్లించి హోమంలో పాల్గొనాలన్నారు. వారికి పూజా సామగ్రి దేవస్థానం నుంచి అందించనున్నట్లు అధికారులు తెలిపారు. పూజా కార్యక్రమం అనంతరం అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

బీ ఫాం అందుకున్న ఎమ్మెల్యే గండ్ర



భూపాలపల్లి అర్బన్: బీఆర్ఎస్ పార్టీ భూపాలపల్లి నియోజకవర్గ అభ్యర్థిగా ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి సోమవారం ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదగా బీ ఫాం అందుకున్నారు. హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో సీఎం బీఫాంలను అందజేశారు.

ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థిగా రవీందర్



భూపాలపల్లి రూరల్: తెలంగాణ ధర్మ సమాజ్ పార్టీ భూపాలపల్లి నియోజకవర్గ అభ్యర్థిగా పట్టణానికి చెందిన కొత్తూరు రవీందర్‌ను సోమవారం ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహరాజ్ ప్రకటించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఏడు శాతం లేని అగ్రకుల బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ ఇతర పార్టీల దుష్ట వైఖరి, కుటీల రాజకీయాలను, మోసపూరిత హామీలను ప్రజాక్షేత్రంలో ఎండగడతామన్నారు. 93 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీల తరఫున ఉన్నది ధర్మ సమాజ్ పార్టీ అని చెప్పారు.

సీపీఐ (ఎంఎల్) అభ్యర్థిగా మల్లేష్



టేకుమట్ల: సీపీఐ (ఎంఎల్) భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా మండలంలోని అంకుషాపూర్ గ్రామానికి చెందిన మారెపెల్లి మల్లేష్‌ను ఎంపికచేశారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ ప్రజలు తన వెంట ఉండి గెలిపించాలని కోరారు.

ఐఎన్‌టీయూసీలో చేరిక



భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి ఏరియాలోని ఏఐటీయూసీ, టీబీజీకేఎస్ యూనియన్లకు చెందిన నాయకులు సోమవారం ఐఎన్‌టీయూసీలో చేరారు. యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ భూపాలపల్లి నియోజకవర్గ అభ్యర్థి గండ్ర సత్యనారాయణరావు ముఖ్యఅతిథిగా హాజరై కండువాలు కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ.. కార్మికుల కష్టాలను ఏఐటీయూసీ, టీబీజీకేఎస్ పట్టించుకోలేదని తెలిపారు. రానున్న గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఏరియాలో అధిక మెజారిటీతో ఐఎన్‌టీయూసీ గెలుస్తుందన్నారు. బీఆర్ఎస్ ఓటమి భయంతోనే ఎన్నికలు నిర్వహించకుండా అడ్డుకుందని చెప్పారు. తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘాన్ని కార్మికులు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అయిత ప్రకాశ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ, ఐఎన్‌టీయూసీ నాయకులు మధు, నర్సింహారెడ్డి, లక్ష్మీపతి, పసునూటి రాజేందర్, రాజేష్, ఠాగూర్, వేణుగోపాల్, రాంబాబు, జనార్దన్, రాములు పాల్గొన్నారు.

సమ్మక్కసాగర్ బ్యారేజీ గేట్లు మూసివేత

కన్నాయిగూడెం: తుపాకులగూడెం వద్ద గోదావరిపై నిర్మించిన సమ్మక్క సాగర్ బ్యారేజీ గేట్లను సోమవారం అధికారులు మూసివేశారు. సమ్మక్కసాగర్ బ్యారేజీలోని 59 గేట్లలో ఆదివారం 24 గేట్లను ఎత్తిన అధికారులు సోమవారం 59 గేట్లను పూర్తిగా మూసివేశారు. బ్యారేజీ సామర్థ్యం 6.94కాగా ప్రస్తుతం 3.59 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతం నుంచి బ్యారేజీలోకి 25,110 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ప్రస్తుత నీటిమట్టం 79.20 మీటర్లుగా ఉంది.

జై తెలంగాణ నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్, పక్కన జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి



సీఎం పర్యటన సైడ్ లైట్స్

- 3.46 నిమిషాలకు వికాస్‌నగర్‌కు హెలికాప్టర్ చేరుకుంది.
- 3.49 హెలికాప్టర్ ల్యాండ్ అయింది.
- 3.51 నిమిషాలకు మంత్రులు, పల్లా, ఎమ్మెల్యేలు సీఎంకు స్వాగతం పలికారు.
- 3.52 గంటలకు హెలిపాడ్ నుంచి బయలుదేరారు.
- 3.55 సభా వేదికపైకి చేరుకున్నారు.
- 4.21 ప్రసంగం ప్రారంభించి, 4.49 గంటలకు ముగించారు.

జనగామ ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన జనం, బీఆర్ఎస్ శ్రేణులు అభివాదం చేస్తున్న సీఎం కేసీఆర్



ఓరుగల్లు గులాబీలో తొలి జోష్

జనగామ ప్రజా ఆశీర్వాద సభ సక్సెస్

- స్థానిక పరిస్థితులను వల్లెవేస్తూ సాగిన సీఎం కేసీఆర్ ప్రసంగం
- మధ్యమధ్యలో చలోక్తులు.. అన్ని వర్గాల వారిని ఆకట్టుకునే ప్రయత్నం
- ఎన్నికల తర్వాత జనగామకు వచ్చి రోజంతా తిరుగుతానని ప్రకటన
- కేరింతలు కొట్టిన పార్టీ శ్రేణులు
- అంతకుముందు ఆర్టీసీ చౌరస్తా నుంచి భారీ ర్యాలీ
- వేలాదిగా తరలి వచ్చిన జనం..
- రెండు గంటలు ఆలస్యంగా సీఎం పర్యటన



జనగామ/జనగామ రూరల్/లింగాలఘణపురం/దేవరుప్పుల/బచ్చన్నపేట: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని జనగామ జిల్లా కేంద్రంలో సోమవారం జరిగిన బీఆర్ఎస్ తొలి ప్రజా ఆశీర్వాద సభ విజయవంతం కావడం.. ఆపార్టీ శ్రేణుల్లో జోష్ నింపింది. ముఖ్య అతిథిగా హాజరైన పార్టీ అధినేత, సీఎం కేసీఆర్.. జనగామ నియోజకవర్గంలోని గత పరిస్థితులను.. తొమ్మిదేళ్ల తర్వాత మారిన పరిస్థితులను తన ప్రసంగంలో వివరించారు. ఒక్కో వర్గం వారికి ఏం చేస్తున్నారో.. భవిష్యత్‌లో ఏం చేయబోతున్నారో చెబుతూ వారిని ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. సాధారణ ఎన్నికల నేపథ్యంలో జనగామ పట్టణం సిద్దిపేట రోడ్డున ఉన్న మెడికల్ కళాశాల మైదానంలో జరిగిన బీఆర్ఎస్ బహిరంగ సభలో సీఎం కేసీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉదయం 10 గంటల నుంచే ప్రజలు, పార్టీ శ్రేణుల రాక మొదలవగా.. 11 గంటల వరకే ప్రాంగణం పూర్తిగా నిండిపోయింది. ఏపూరి సోమన్న, మిట్టపల్లి సురేందర్, దివంగత సాయిచంద్ బృందం కళాకారుల తెలంగాణ ధూం ధాం పాటలు సభికులను ఉత్తేజపర్చాయి. జనగామ-సిద్దిపేట ప్రధాన రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా సీపీ అంబర్ కిశోర్ ఝా నేతృత్వంలో డీసీపీ పి.సీతారాం ఆధ్వర్యంలో పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

పల్లా ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆర్టీసీ చౌరస్తా నుంచి మెడికల్ కళాశాల మైదానం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే, రైతు సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజయ్య, మాజీ ఎమ్మెల్సీ వెంకటేశ్వర్లు, మండల శ్రీరాములు, సిద్ధయ్య పార్టీ శ్రేణులతో కలిసి ఒగ్గుడోలు విన్యాసాలు, మహిళల కోలాటం, బతుకమ్మలు, బోనాలు, ముస్లిం మైనార్టీల కళారూపాలతో ర్యాలీగా సభా ప్రాంగణానికి చేరుకున్నారు.

సీఎం రాక రెండు గంటలు ఆలస్యం..

సీఎం.. బహిరంగ సభలో మధ్యాహ్నం 1.45 గంటలకు పాల్గొనాల్సి ఉండగా.. రెండు గంటలు ఆలస్యంగా 3.55 గంటలకు వచ్చారు. ఆయనకు మంత్రులు ఎర్రబెల్లి, సత్యవతి రాథోడ్, బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి, నాయకులు స్వాగతం పలికారు. ముందుగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి.. సీఎం కాళ్లు మొక్కి ఆశీర్వాదం తీసుకున్నారు.

సీఎం చలోక్తులు..

సభా వేదికపై సీఎం కేసీఆర్ అడుగుపెట్టగానే.. పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున జై తెలంగాణ అంటూ నినదించారు. ప్రజలకు అభివాదం చేస్తూనే.. 'అమ్మో.. పల్లా హుషార్‌గానే ఉన్నాడు.. నాకు తెలియదు ఇంత దమ్మున్నోడని' అంటూ తనదైన శైలిలో చలోక్తులు విసిరారు. జనగామ నియోజకవర్గ అభివృద్ధికి కావాల్సిన చిట్టాను రాజేశ్వర్‌రెడ్డి చదివి వినిపించగా.. 'దొడ్లకు వచ్చిన గోద.. పెండ పెట్టకుండా ఉంటదా.. నేను వచ్చాను కదా.. ఇక ఆ హామీలన్నీ కచ్చితంగా నెరవేర్చి తీరుతా.. లేదంటే పల్లా ఊరుకోడు కదా' అంటూ మాట్లాడారు. రాజేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తే అధికారంలోకి వచ్చిన నెలరోజుల్లో చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేసి తీరుతామంటూ వాగ్దానం చేశారు. 'తెలంగాణ ఉద్యమ సమయంలో కరువుతో అల్లాడిన బచ్చన్నపేటను చూసి ఏడ్చిన.. ఇప్పుడు పచ్చని పొలాలు చూస్తూ మురిసిపోతున్నా.. ఇదే మన తెలంగాణ స్పెషాలిటీ' అంటూ కేసీఆర్.. నాటి జ్ఞాపకాలను గుర్తుకు చేశారు. కరువుకు కేరాఫ్‌గా ఉన్న జనగామ రైతుల్లో మనం అధికారంలోకి వచ్చిన తర్వాత జగ్రముఖం తెలివికి వచ్చిందంటూ అన్నదాతలను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్‌ను బంగాళాఖాతంలో పడేయాలని సీఎం అనడంతో జనం పెద్ద ఎత్తున స్పందించి కేరింతలు కొట్టారు. ఎన్నికల తర్వాత జనగామకు వచ్చి రోజంతా తిరుగుతానంటూ శ్రేణుల్లో జోష్ నింపారు. 'జనగామ నియోజకవర్గంలోని మద్దూరు, లద్నూరులో రెండు, మూడువేల మంది మిత్రులు ఉన్నారు.. మేరా దోస్తోంకో చేర్యాల్.. నా దోస్తులు ఉన్న ఇలాఖాలోనే ఎన్నికల చివరి సభ ఉంటుంది' అంటూ ప్రసంగం ముగించారు. సభావేదికపై నేతలందరూ ఆసీనులవగా అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సిట్టింగ్ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి.. కేసీఆర్ ప్రసంగం ముగిసేంత వరకు పక్కన నిల్చున్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగం, ఎమ్మెల్సీ బండా ప్రకాశ్, మహిళా కమిషన్ సభ్యురాలు గద్దల పద్మ, గాంధీ నాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ పి.జమున లింగయ్య, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు ఇర్రి రమణారెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గ సమన్వయకర్త గుజ్జ సంపత్‌రెడ్డి, నిమ్మతి మహేందర్‌రెడ్డి, బాల్దె సిద్దిలింగం, తాళ్ల సురేశ్‌రెడ్డి, బండ యాదగిరిరెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

చేర్యాల, జనగామపై కేసీఆర్‌కు మమకారం
రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు


- వివరాలు 10లో▸

కేసీఆర్‌కు దండం పెడుతున్న పొన్నాల



పొన్నాల సీనియర్ నేత..

బహిరంగసభలో సీనియర్ నేత పొన్నాల లక్ష్మయ్య.. సీఎం సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈసందర్భంగా ఆయనను ఉద్దేశించి సీఎం కేసీఆర్ మాట్లాడారు. 'పొన్నాల సీనియర్ నేత. కాంగ్రెస్‌లో అణగారిన వర్గాలకు అవకాశం లేదు.. నాలుగున్నర దశాబ్దాలుగా అంకిత భావంతో పనిచేస్తే చివరికి అవమానమే మిగిలింది.. నాకు బాధేసి ఫోన్‌లో మాట్లాడి.. పార్టీలోకి రమ్మన్నా.. ఇప్పుడు గులాబీ జెండా కప్పుకున్నడు.. అన్ని వర్గాలను బీఆర్ఎస్ ఆదరించి పెద్ద పీట వేస్తుంది' అని కేసీఆర్ పేర్కొన్నారు. పొన్నాల మనసు గాయపడితే.. బీఆర్ఎస్ మందు వేసి నయం చేస్తుందని చెప్పుకొచ్చారు.



బ్రహ్మచారిణి అలంకరణలో అమ్మవారు

కాళేశ్వరం: శ్రీదేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయ అనుబంధ దేవాలయంలోని శ్రీశుభానందదేవి అమ్మవారు రెండవ రోజు బ్రహ్మచారిణి అలంకరణలో సోమవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు ప్రత్యేకంగా అమ్మవారిని పూలు, పట్టువస్త్రాలతో అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి దర్శించుకున్నారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

కలెక్టర్ భవేష్‌మిశ్రా



ప్రజావాణి దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్


భూపాలపల్లి అర్బన్: ప్రజావాణిలో వచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ భవేష్‌మిశ్రా ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని మీటింగ్‌హాల్‌లో ప్రజావాణి నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల సమస్యలకు సంబంధించిన 36 దరఖాస్తులను కలెక్టర్ స్వీకరించారు. దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖలకు కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను ప్రాధాన్యతతో వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలన్నారు.

అధ్యయనం చేయాలి

గ్రామీణ ఆర్థిక, సామాజిక స్థితులపై అధ్యయనం చేయడం భవిష్యత్‌లో విధి నిర్వహణకు దోహదపడుతుందని కలెక్టర్ భవేష్‌మిశ్రా అన్నారు. సెంట్రల్ సెక్రటరియేట్‌లో కొత్తగా నియామకమై పనిచేస్తున్న 25మంది అసిస్టెంట్ ఆఫీసర్లు రెండు వారాలు శిక్షణలో భాగంగా జిల్లాలోని మారుమూల గ్రామాలైన గంగారం, మేడిపల్లి, గొర్లవీడు, చెల్పూర్, కొడవటంచకు వచ్చారు. ఐదు టీంలుగా ఏర్పడి ఈ నెల 16నుంచి 20వ తేదీ వరకు అధ్యయనం చేయనున్నారు. సోమవారం కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం కలెక్టర్ వారితో మాట్లాడి వారికి దిశా నిర్దేశంచేశారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ మేనేజర్ కుమారస్వామి, జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత పాల్గొన్నారు.

కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం

అభ్యర్థి గండ్ర సత్యనారాయణ రావు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న సత్యనారాయణరావు

గణపురం: వచ్చే శాసనసభ ఎన్నికల్లో భూపాలపల్లిలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరడం ఖాయమని ఆపార్టీ అసెంబ్లీ అభ్యర్థి గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలకేంద్రంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజల కలను సాకారం చేసి రాష్ట్రాన్ని ప్రకటించిన సోనియాగాంధీకి ప్రేమతో.. ఈ సారి కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టం కట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజావ్యతిరేక పాలనను కొనసాగిస్తున్న బీఆర్ఎస్‌కు, ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డికి తగిన బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. తనను నియోజకవర్గ ప్రజలు భారీ మెజార్టీతో గెలుపించాలని కోరారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

గణపురం మండలానికి చెందిన బీఆర్ఎస్, బీజేపీకి చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో మండల నాయకులు ల్యాదళ్ల సమ్మయ్య, బూర రాజ్‌గోపాల్, బొడిగ శివ, మచ్చిక రక్షిత్, పసునూటి వెంకటేష్, బొల్ల శ్రీకాంత్, రజనీకాంత్, ఎండీ గౌస్, దండుగుల రవీందర్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దూడపాక శంకర్, మండల అధ్యక్షుడు రేపాక రాజేందర్, ఎంపీటీసీ విడిదినేని అశోక్, నాయకులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేయండి


ములుగు ఎస్పీ గౌష్ ఆలం



వెల్తుర్లపల్లి చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్పీ గౌష్ ఆలం

వెంకటాపురం(ఎం): చెక్‌పోస్టుల వద్ద అన్ని రకాల వాహనాలను తనిఖీ చేయాలని ములుగు ఎస్పీ గౌష్‌ఆలం పోలీసు అధికారులకు సూచించారు. మండల పరిధిలోని వెల్తుర్లపల్లి చెక్‌పోస్టును ఎస్పీ సోమవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రూ.50 వేల కంటే ఎక్కువగా డబ్బులు తీసుకెళ్తే ఆధారాలు పరిశీలించాలన్నారు. ఆధారాలు లేకపోతే డబ్బులు సీజ్ చేయాలన్నారు. చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. అదేవిధంగా రేపు రాహుల్‌గాంధీ రామప్పకు వస్తున్న నేపథ్యంలో రామప్పలోని హెలిపాడ్ స్థలాన్ని, రామాంజాపూర్‌లోని సభాస్థలిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ములుగు డీఎస్పీ రవీందర్, సీఐ రంజిత్‌కుమార్, ఎస్సై చల్ల రాజు పాల్గొన్నారు.


లాభాల వాటా చెల్లించాలని నిరసనలు



ఏఐటీయూసీ ఆధ్వర్యంలో..



సీఐటీయూ ఆధ్వర్యంలో..



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న కీర్తిరెడ్డి

భూపాలపల్లి అర్బన్: సింగరేణి కార్మికులకు రావాల్సిన లాభాల వాటాను సింగరేణి యాజమాన్యం ఎన్నికల కోడ్ కారణంగా నిలిపి వేయడంతో కార్మిక సంఘాల నాయకులు మండిపడుతున్నారు. యాజమాన్య విధానాన్ని నిరసిస్తూ సోమవారం గనులపై కార్మిక సంఘాల నాయకులు వేర్వేరుగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు.

- ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అన్ని గనులు, డిపార్ట్‌మెంట్‌లలో అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, బ్రాంచ్ కార్యదర్శి మోటపలుకుల రమేష్ మాట్లాడుతూ 32 శాతం లాభాల వాటా ప్రకటించిన యాజమాన్యం ఎన్నికల కోడ్‌ను సాకుగా చూపించి కార్మికులను మభ్యపెట్టడం తగదని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు చంద్రమౌళి, తిరుపతి, కృష్ణమూర్తి, రాజన్న, శ్రీను, విజేందర్, శంకర్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.
- సీఐయూటీ ఆధ్వర్యంలో ఏరియాలోని కేటీకే 5వ గనిలో ప్లకార్డులు ప్రదర్శించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బ్రాంచీ కార్యదర్శి కంపేటి రాజయ్య మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్‌తో లాభాల వాటాను చెల్లించకపోవడం సిగ్గు చేటుగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్, ఐలయ్య, ఏసుబాబు పాల్గొన్నారు.
- బీఎంఎస్ ఆధ్వర్యంలో ఏరియాలోని అన్ని గనులు, డిపార్ట్‌మెంట్‌లలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తంచేశారు. బ్రాంచీ ఉపాధ్యక్షుడు అప్పాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏరియాలోని కేటీకే 1వ గనిలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌కు బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కీర్తిరెడ్డి హాజరై మాట్లాడారు. యాజమాన్యం స్పందించకపోతే సమ్మె చేయడానికైనా సింగరేణి కార్మికులు సిద్ధంగా ఉండాలన్నారు. ఎన్నికల కోడ్ రాకముందు జారీచేసిన సర్క్యులర్ అమలు చేయకుండా యాజమాన్యం కుట్ర పన్నుతున్నట్లు తెలిపారు. కార్మికుల కష్టార్జితం నిలిపివేయడం సరైనది కాదన్నారు. ఈ కార్యక్రమంలో సుజేందర్, లక్ష్మణ్, శ్రీనివాస్, మల్లారెడ్డి, రమేష్, మల్లేష్, సమ్మయ్య, రాజు, సాగర్ పాల్గొన్నారు.
- టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో సింగరేణి కార్మికులకు రావాల్సిన లాభాల వాటాను చెల్లించాలని డిమాండ్ చేస్తూ నాయకులు సోమవారం ఏరియా ఇన్‌చార్జ్ జీఎం వెంకటయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బ్రాంచీ ఉపాధ్యక్షుడు బడితెల సమ్మయ్య మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ నేపథ్యంలో చెల్లింపులు ఆపడం కార్మికులకు బాధగా ఉందన్నారు. ప్రతి ఏడాది లాభాల వాటాను తీసుకుంటున్నామని, కోడ్ రాకముందే యాజమాన్యం ప్రకటించిందన్నారు.

అత్యాచారం కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష



కీర్తి సురేష్

భూపాలపల్లి అర్బన్/గణపురం: బాలికపై అత్యాచారం, బెదిరింపులకు పాల్పడిన వ్యక్తికి 20 సంవత్సరాల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ ఫోక్సో సెషన్ జడ్జి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నారాయణబాబు సోమవారం తీర్పు వెల్లడించారు. గణపురం మండల పరిధి గాంధీనగర్ గ్రామానికి చెందిన కీర్తి నరేష్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై గతేడాది సెప్టెంబర్ 1వ తేదీన అత్యాచారం చేశాడు. బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ సెల్ఫీ ఫొటోలు దిగి బ్లాక్ మెయిల్ చేశాడు. చాటింగ్ చేయాలని, లేనిచో ఫొటోలను యూట్యూబ్, వాట్సాప్‌లో పెడతానని భయభ్రాంతులకు గురిచేశాడు. బాలికను శారీరకంగా వాడుకున్నాడు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై అభినవ్ కేసు నమోదుచేసి నరేష్‌ను రిమాండ్‌కు తరలించారు. చిట్యాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పులి వెంకట్ పూర్తిస్థాయిలో విచారణ జరిపి కోర్టులో ఆధారాలను సమర్పించారు. దీంతో బాలికపై అత్యాచారం, బ్లాక్ మెయిల్ చేసిన యువకుడు కీర్తి నరేష్‌కు జిల్లా ఫోక్సో స్పెషల్ జడ్జి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి నారాయణబాబు సోమవారం తీర్పు వెలువరించారు. ఈ కేసులో సమర్థంగా పనిచేసిన పోలీసులను ఎస్పీ కిరణ్ ఖారే అభినందించారు.

పోస్టాఫీసుల్లో ఆధార్ కేంద్రాలు

ఖిలా వరంగల్: వరంగల్ డివిజన్ పరిధిలోని ముఖ్య తపాలాశాఖ కార్యాలయాల్లో 11 ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తపాలా పర్యవేక్షకుడు ఎం.నరసింహస్వామి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలు, కళాశాలలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించిన సందర్భంగా విద్యార్థులకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి ఆధార్ అప్‌డేట్ చేయనున్నామని తెలిపారు. ప్రధానంగా ధర్మారం, నర్సంపేట, మరిపెడ, కురవి, మహబూబాబాద్, దేశాయిపేట, తొర్రూరు, డోర్నకల్, నెక్కొండ, వర్ధన్నపేట, వరంగల్ హెడ్‌పోస్టాఫీసుల్లో ఆధార్ కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కాజీపేటలో రైల్వే ఈసీసీఎస్ అడ్వాన్స్ బ్యాలెట్ పోలింగ్



కాజీపేట రైల్వే ఈసీసీఎస్ కార్యాలయం వద్ద కార్మికుల సందడి

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే ఈసీసీఎస్ కార్యాలయంలో అడ్వాన్స్ బ్యాలెట్ పోలింగ్ (ఆన్‌లైన్‌లో విధులపై వెళ్లే రైల్వే కార్మికులకు) జరిగింది. ఈ నెల 19వ తేదీన రైల్వే ఈసీసీఎస్ ఎన్నికలు అధికారికంగా జరగనున్నాయి. అయితే సెక్షన్‌లో ఆన్‌లైన్‌లో ఔట్ స్టేషన్‌కు విధులకు వెళ్లే వారు ఓటింగ్ రోజు అందుబాటులో ఉండరు. దీంతో దక్షిణ మధ్య రైల్వే అధికారుల అనుమతితో ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు ఓటింగ్ నిర్వహించేందుకు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో సోమవారం కాజీపేట రైల్వే ఈసీసీఎస్ కార్యాలయంలో జరిగిన ఓటింగ్‌లో రైల్వే పైలట్లు, అసిస్టెంట్ పైలట్లు, ట్రైన్ మేనేజర్లు (గార్డులు) ఇతర విభాగాలకు చెందిన ఆన్‌లైన్ స్టాఫ్ పాల్గొన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన ఎన్నికల్లో 219 మంది ఆన్‌లైన్ స్టాఫ్ ఓటు వినియోగించుకున్నారని రైల్వే అధికారులు పేర్కొన్నారు. మంగళ, బుధవారాల్లో కూడా పోలింగ్ జరుగుతుందని వారు తెలిపారు.



సినీ ఫక్కీలో తరలిస్తున్న గంజాయి పట్టివేత

రూ.75 లక్షల విలువైన మూడు క్వింటాళ్ల సరుకు స్వాధీనం

- ఇద్దరి అరెస్టు, ముగ్గురు పరారీ
- వివరాలు వెల్లడించిన సీపీ అంబర్ కిశోర్ ఝా



నిందితుల అరెస్టు చూపుతున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

వరంగల్ క్రైం/ఎల్కతుర్తి: ఆంధ్రప్రదేశ్ నుంచి మహారాష్ట్రకు రవాణా చేస్తున్న ఎండు గంజాయిని టాస్క్‌ఫోర్స్, ఎల్కతుర్తి పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారి సోమవారం కమిషనరేట్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి గంజాయి పట్టివేత ఘటనకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. మధ్యప్రదేశ్‌లోని కార్గవ్ జిల్లా ఊస్ గ్రామానికి చెందిన కొలి రాజవర్మ, మహారాష్ట్ర జలగావ్ జిల్లా ఆకుల్‌దేడా గ్రామానికి చెందిన నాందేవ్ సాహెబ్ రావ్ పాటిల్, రాహుల్ సబులే, శుభం గోతిరాం సబులే, శేషుకుమార్.. సులభంగా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. దీనికి గంజాయి విక్రయాలే మార్గమని భావించారు. అనుకున్నదే తడవుగా ఆంధ్రప్రదేశ్, ఒడిశా సరిహద్దు ప్రాంతంలో రూ.75 లక్షల విలువైన 300 కిలోల ఎండు గంజాయిని కొనుగోలు చేశారు. 2 కిలోల చొప్పున ప్యాకెట్లు చేసి సినీ ఫక్కీలో డీసీఎం టాప్‌పై ఎవరికీ అనుమానం కలగకుండా లోడ్ చేసి తాటిపత్రి కప్పారు. అనంతరం ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం నుంచి హనుమకొండ మీదుగా మహారాష్ట్రకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో ఎల్కతుర్తి మండలం పెంచికల్‌పేట వద్ద ఏర్పాటు చేసిన ఎన్నికల చెక్‌పోస్ట్ వద్ద పోలీసులకు పట్టుబడ్డారు. తనిఖీల్లో డీసీఎం రిజిస్ట్రేషన్ నంబర్, ఇంజన్ నంబర్‌కు మ్యాచ్ కాకపోవడంతో పోలీసులు అనుమానం వచ్చి వ్యాన్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేయగా ఎండు గంజాయి ప్యాకెట్లు కనిపించాయి. నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా ఎండు గంజాయి రవాణాకు పాల్పడుతున్నట్లు నేరం అంగీకరించారు. దీంతో గంజాయి, డీసీఎం స్వాధీనం చేసుకుని కొలి రాజవర్మ, నాందేవ్ సాహెబ్ రావ్ పాటిల్‌ను అరెస్ట్ చేశారు. రాహుల్ సబులే, శుభం గోతిరాం సబులే, శేషుకుమార్ పరారయ్యారని సీపీ అంబర్‌కిశోర్ ఝా తెలిపారు.

అధికారులకు అభినందన..

ఎండు గంజాయిని పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన సెంట్రల్ జోన్ డీసీపీ బారీ, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్, కాజీపేట ఏసీపీ డేవిడ్ రాజ్, టాస్క్‌ఫోర్స్, ఎల్కతుర్తి ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్ దేవేందర్, సంజీవ్, ఎల్కతుర్తి, టాస్క్ ఫోర్స్ ఎస్సైలు రాజ్‌కుమార్, శరత్‌కుమార్, ఏఎస్ఐ సల్మాన్ పాషా, సిబ్బంది అశోక్, స్వర్ణలత, సత్యనారాయణ, కిరణ్, కరుణాకర్, సాంబరాజు, గౌతమ్, సతీష్‌కుమార్, నాగరాజు, శ్రావణ్‌కుమార్, ఎల్కతుర్తి సిబ్బందిని వరంగల్ సీపీ అభినందించారు.

కేసముద్రం రైల్వే స్టేషన్‌లో మరో వ్యక్తి అరెస్ట్



నిందితుడి అరెస్టు చూపుతున్న డీఎస్పీ సత్యనారాయణ

కేసముద్రం : ఓ వ్యక్తి ఎండు గంజాయి తరలిస్తూ పోలీసులు పట్టుబడ్డాడు. ఈ ఘటన సోమవారం మహబూబాబాద్ జిల్లా కేసముద్రం రైల్వేస్టేషన్ సమీపంలో జరిగింది. మహబూబాబాద్ డీఎస్పీ సత్యనారాయణ కథనం ప్రకారం.. ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లాలోని షేరగడ గ్రామానికి చెందిన రంజిత్‌కుమార్ ప్రధాన్ గంజాయి వ్యాపారంతో అధిక డబ్బు సంపాదించాలనుకున్నాడు. అనుకున్నదే తడవుగా ఒడిశాలోనే గుర్తుతెలియని వ్యక్తుల వద్ద 16 కేజీల ఎండు గంజాయిని కొనుగోలు చేసి రైలులో తరలిస్తున్నాడు. ఈ క్రమంలో రైలులో పోలీసులు చూసి గంజాయి బ్యాగులతో కేసముద్రం రైల్వేస్టేషన్‌లో దిగి గాంధీసెంటర్ వైపునకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో అదే ప్రాంతంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులకు అనుమానం కలిగి రంజిత్‌కుమార్ ప్రధాన్ అదుపులోకి తీసుకుని రెండు బ్యాగులను పరిశీలించడంతో ఎండు గంజాయి లభించింది. దీంతో స్థానిక తహసీల్దార్ సమక్షంలో పంచనామా నిర్వహించి ఎండుగంజాయిని స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.4లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. కాగా, గంజాయి పట్టుకున్న ఎస్సై తిరుపతి, మహబూబాబాద్ రూరల్ సీఐ రమేష్, సిబ్బందిని డీఎస్పీ ఈ సందర్భంగా అభినందించారు.

చేర్యాల, జనగామపై కేసీఆర్‌కు మమకారం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పొన్నాల లక్ష్మయ్య

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

జనగామ/జనగామ రూరల్/లింగాలఘణపురం/దేవరుప్పుల/బచ్చన్నపేట: చేర్యాల, జనగామపై మమకారంతోనే సీఎం కేసీఆర్.. ఇక్కడి ఎమ్మెల్యే యాదన్నకు సముచిత గౌరవం ఇచ్చి మరింత అభివృద్ధి చేయడానికి పల్లా రాజేశ్వర్‌రెడ్డిని దూతగా పంపారని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సోమవారం జనగామలోని మెడికల్ కళాశాల మైదానంలో జరిగిన బీఆర్ఎస్ బహిరంగ సభలో సీఎం కేసీఆర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ జిల్లాలో మూడు ఎమ్మెల్యేలను అఖండ మెజారిటీతో గెలిపించడంతోపాటు ఉమ్మడి జిల్లాలో 12 స్థానాల్లో బీఆర్ఎస్ విజయబావుట వేసేలా సమన్వయంతో పనిచేస్తామన్నారు. మీరు చెబితే మాకు ఓట్లు పడుతయ్...మా ముఖాల కంటే మీ పేరు చెబితేనే ఎక్కువ ఓట్లు పడుతాయని మంత్రి ఎర్రబెల్లి వ్యాఖ్యానించారు.

ప్రజా ఆశీర్వాద సభకు వచ్చిన వారికి ప్రత్యేక కృతజ్ఞతలు..

ముచ్చటగా మూడోసారి కేసీఆర్‌ను సీఎంగా గెలిపించేందుకు ప్రజా ఆశీర్వాద సభకు లక్షలాదిగా తరలివచ్చిన ప్రజలకు బీఆర్ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ అవమానాలు భరించలేక బీఆర్ఎస్‌లో చేరిన పొన్నాల లక్ష్మయ్య, పెద్దన్న ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ఆశీస్సులతో బీఆర్ఎస్‌కు మరింత మెజార్టీ పెరుగుతుందన్నారు. నా ముఖం తెలియకున్నా పెద్దసార్ విశ్వాసం, బీఆర్ఎస్‌పై నమ్మకంతో వస్తే జనగామ ప్రజలు స్వీకరించారన్నారు. జనగామకు కేసీఆర్ సార్ వస్తే ఉసిర్లపుట్టలా జనం వస్తారని చలోక్తులు విసురుతూ జనగామ జిల్లాలో చేపట్టాల్సిన మౌలిక వసతుల కల్పనపై ప్రసంగించారు. మలన్న, తపాస్‌పల్లి ద్వారా పంట కాల్వలు, చెక్‌డ్యామ్‌లు, మినీలిఫ్ట్‌ల కల్పన, పాలిటెక్నిక్, వెటర్నటీ కళాశాల, చీటకోడూరు రిజర్వాయర్ నుంచి స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ప్రత్యేక పథకం అవసరం ఉందన్నారు. జిల్లా కేంద్రం పురోగతి సాధిస్తున్న క్రమంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, రంగప్ప చెరువు అభివృద్ధి, స్పోర్ట్స్ కళాశాల, బచ్చన్నపేట, చేర్యాల, నర్మెటలో జూనియర్ కళాశాల, జిల్లా నలుమూల ప్రాంతాల యువత కోసం ఇక్కడి వ్యవసాయరంగం, పాడి పరిశ్రమ, పండ్ల తోటలకు అనుసంధానంగా ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ ఏర్పాటు చేయాలని కోరారు. చేర్యాల రెవెన్యూ డివిజన్ కార్యాలయం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

కేసీఆర్.. తెలంగాణ మార్క్‌గా నిలిచారు..

సుపరిపాలనతో సీఎం కేసీఆర్.. తెలంగాణ మార్క్‌గా నిలిచారని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి కొనియాడారు. తెలంగాణ ఏర్పడక ముందు ఎక్కడ చూసిన కరువు ఛాయలు కనిపించే జనగామను సీఎం కేసీఆర్ అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నిలిపారన్నారు.

కేసీఆర్ పాలన చరిత్రాత్మకం..

సీఎం కేసీఆర్ పాలనను టీపీసీసీ మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత బీఆర్ఎస్ నేత పొన్నాల లక్ష్మయ్య కొనియాడారు. ఎన్నికల ముందు, తర్వాత రాజకీయ పార్టీల తీరును విశ్లేషిస్తే 45 ఏళ్లలో అవమానాలు, అవహేళనకు గురైన బడుగుల అభ్యున్నతికి కేసీఆర్ బాటలు వేశారన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే మూడు నెలల్లో కులగణన, సకల జనుల సర్వే చేయించి వారి అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ప్రతిపక్షాలు ఎన్నికల స్టంట్‌గా పథకాలు రూపొందిస్తున్నాయే తప్ప పారదర్శకత లేదన్నారు. మూడోసారి కేసీఆర్‌ను సీఎంగా గెలిపించాల్సిన ఆవశ్యకత తెలంగాణ సమాజంపై ఉందన్నారు.

చిక్కిన దారి దోపిడీ ముఠా..

- అరెస్ట్, రిమాండ్
- మూడు సెల్‌ఫోన్‌లు, బైక్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఏసీపీ డేవిడ్ రాజ్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ డేవిడ్ రాజ్

హసన్‌పర్తి: దారి దోపిడీలకు పాల్పడుతున్న ఓ ముఠా సోమవారం పోలీసులకు చిక్కింది. దీంతో మూడు సెల్‌ఫోన్లు, రూ. 3 వేల నగదుతో పాటు ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ముఠాను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను కాజీపేట ఏసీపీ డేవిడ్ రాజ్ విలేకరులకు వెల్లడించారు.

హనుమకొండ జిల్లా పరకాల మండలం కామారెడ్డిపల్లికి చెందిన తిక్కా యశ్వంత్ (ప్రస్తుతం పద్మాక్షి కాలనీ, హనుమకొండ), జమ్మికుంట మండలం శాయంపేటకు చెందిన దర్గుల అంజి, హనుమకొండ బాలసముద్రానికి చెందిన కుమ్మరి రాజేష్ ముఠాగా ఏర్పడ్డారు. అర్ధరాత్రి దారి దోపిడీ చేయడమే వీరి పని. ముఖ్యంగా ప్రధాన రహదారుల్లోని నిర్మానుష్య ప్రదేశాల్లో నిలిపి ఉన్న వాహనాలు, పెట్రోల్ పంపుల్లో దోపిడీకి పాల్పడుతారు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం హసన్‌పర్తి పెద్దచెరువు పెట్రోల్ పంపు వద్ద అర్ధరాత్రి సిబ్బంది సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో దారి దోపిడీ దొంగలను పట్టుకున్నారు. అనంతరం విచారించగా గతంలో దేవన్నపేట టోల్‌ప్లాజా వద్ద నిలిపి ఉన్న లారీ అద్దాలు పగులగొట్టి డ్రైవర్‌పై దాడి చేసి రూ.35వేలతోపాటు స్మార్ట్‌ఫోన్ చోరీ చేసినట్లు అంగీకరించారు. అలాగే, దేవన్నపేట, చింతగట్టు ఓఆర్‌ఆర్ వద్ద ఓ లారీని ఆపి డ్రైవర్‌ను బెదిరించి రూ.30వేల విలువైన స్మార్ట్ ఫోన్ ఎత్తుకెళ్లినట్లు విచారణలో వెల్లడైందని ఏసీపీ చెప్పారు.

బెదిరించి దోపిడీ .. తిరగబడితే దాడి

ముఖ్యంగా ప్రధాన రహదారుల్లో దోపిడీకి పాల్పడడం ముఠా టార్గెట్. రాత్రి వేళల్లో ద్విచక్రవాహనంపై ప్రధాన రహదారిలో సంచరిస్తూ నిర్మానుష్య ప్రాంతంలో నిలిపి ఉన్న వాహనాల డ్రైవర్లను బెదిరించి వారి వద్ద నగదుతో పాటు సెల్‌ఫోన్లు ఎత్తుకెళ్లడం ఈ ముఠా పని. ఎవరైనా ఎదురు తిరిగితే వారిపై దాడులకు పాల్పడే వారని ఏసీపీ తెలిపారు. సమావేశంలో హసన్‌పర్తి సీఐ గోపీ, తదితరులు పాల్గొన్నారు.

'ఓపెన్' పరీక్షలు ప్రారంభం

- వరంగల్‌లో ఒకరికి బదులు మరొకరు పరీక్ష రాస్తుండగా పట్టుకున్న ఇన్విజిలేటర్లు
- మట్టెవాడ పీఎస్‌లో ఫిర్యాదు

విద్యారణ్యపురి: ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. హనుమకొండలోని ప్రాక్టీసింగ్ హైస్కూల్, పెట్రోల్‌పంపు హైస్కూల్ పరీక్ష కేంద్రాలను డీఈఓ ఎండీ అబ్దుల్‌హై, ఓపెన్ స్కూల్ ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ ఎం శంకర్‌రావు సందర్శించి పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. రెండు పూటలు పరీక్షలు నిర్వహిస్తున్నారు.

ఒకరికి బదులు మరొకరు..

వరంగల్‌లోని మట్టెవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో ఓపెన్ స్కూల్ టెన్త్ పరీక్షలో తొలిరోజు తెలుగు పరీక్షలో ఒకరికి బదులు మరొకరు (ఇన్‌పర్సనేషన్ మాల్‌ప్రాక్టీస్).. ఇలా ఆరుగురు పరీక్షలు రాస్తూ ఇన్విజిలేటర్లకు పట్టుబడ్డారు. దీంతో ఆరుగురిపై చీఫ్ సూపరింటెండెంట్ అరుణ.. వరంగల్ మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఒరిజినల్ స్టూడెంట్		ఇన్‌పర్సనేషన్ స్టూడెంట్
ఎండీ సోఫియాన్	-	ఎండీ మషూఖ్
ఎండీ అబ్దుల్ ఖురేషి	-	ఎండీ అక్మల్
ఎండీ అబిద్ అలీ	-	ఎండీ ఇషాఖ్
ఎండీ ఆరిఫ్ ఉల్లా	-	షేక్ ఆమన్
ఇష్రత్ కౌనాయిన్	-	షాహేదాబేగం
హుస్నా గోహర్	-	హుస్నా గౌహార్



డోర్నకల్ చెక్‌పోస్టు వద్ద తనిఖీ

- రూ.1.68 లక్షలు పట్టివేత



బస్సులో తనిఖీ చేస్తున్న ఏఎస్పీ చెన్నయ్య

డోర్నకల్: డోర్నకల్ శివారులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును సోమవారం అడిషనల్ కలెక్టర్ డేవిడ్, అడిషనల్ ఎస్పీ చెన్నయ్య తనిఖీ చేశారు. చెక్ పోస్టులో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వివరాలు తెలుసుకుని అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అనంతరం అడిషనల్ ఎస్పీ చెన్నయ్య ముల్కలపల్లి చెక్‌పోస్టును పరిశీలించారు. ఏఎస్పీ స్వయంగా ఆర్టీసీ బస్సులో తనిఖీలు నిర్వహించారు.

నగదు స్వాధీనం..

ఆధారం లేకుండా తరలిస్తున్న రూ.1.68 లక్షల నగదును డోర్నకల్ చెక్‌పోస్టు వద్ద పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఖమ్మం పట్టణ పరిధి ఖానాపూర్ హవేలికి చెందిన చికెన్ వ్యాపారి శీలం భద్రయ్య ద్విచక్రవాహనంపై వెళ్తుండగా పోలీసులు తనిఖీ చేశారు. ఇందులో నగదు లభించడంతో సీజ్ చేసినట్లు ఎస్ఎస్‌టీ మోజమ్ అలీ అన్సారీ తెలిపారు.

బతుకమ్మ చీరలు, మద్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న మద్యంతో పోలీసులు

స్టేషన్‌ఘన్‌పూర్: టాస్క్‌ఫోర్స్ సీఐ పవన్ ఆధ్వర్యంలో ఎంసీసీ (మాడల్ కోడ్ కండక్ట్) టీమ్ సోమవారం మండలంలోని తాటికొండలో, జిట్టెగూడెం గ్రామాల్లో దాడులు నిర్వహించింది. ఈ సందర్భంగా తాటికొండలో ఐలోని కిరణ్‌కుమార్ ఇంటి వద్ద అక్రమంగా విక్రయిస్తున్న రూ.15,620 విలువైన 22 లీటర్ల మద్యాన్ని సీజ్ చేసింది. జిట్టెగూడెంలో రేషన్ డీలర్ బాబురావు నిబంధనలకు విరుద్ధంగా బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తుండగా పట్టుకుంది. 50 చీరలు సీజ్ చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించింది. ఈ ఘటనలపై కేసు నమోదు చేసినట్లు ఘన్‌పూర్ సీఐ సట్ల రాజు, ఎస్సై నాగరాజు తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు.

పురుగుమందు రహిత ఆహారం 'ఆరోగ్యకరం'

- ఖేతీ విరాసత్ మిషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉమేంద్రదత్



మాట్లాడుతున్న ఉమేంద్రదత్

హసన్‌పర్తి: పురుగు ముందు రహిత ఆహారం ఆరోగ్యకరమని పంజాబ్ ఖేతీ విరాసత్ మిషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉమేంద్ర దత్ అన్నారు. ఎస్సార్ యూనివర్సిటీలో స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌లో ప్రపంచ ఆహార దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. 'సేవ్ ది ఫుడ్ విత్ అడ్వాన్స్ టెక్నాలజీ' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉమేంద్రదత్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సురక్షిత ఆహారం వ్యాధి లేని జీవితానికి కీలకమన్నారు. ఎస్సార్ యూనివర్సిటీ చాన్స్‌లర్ ఎ.వరదారెడ్డి మాట్లాడుతూ అధునాతన ఆహార ఉత్పత్తి సాంకేతికతను దృష్టిలో ఉంచుకుని వివిధ నిపుణుల మధ్య సమాచార మార్పిడికి ఈ సింపోజియం వేదికగా నిలుస్తుందన్నారు. వ్యవసాయ కళాశాల డీన్ భూపాల్ రాజ్ మాట్లాడుతూ పౌష్టికాహార లోపమే సమాజంలో ప్రధాన సమస్య అని పేర్కొన్నారు. పోషకాహార లోపాన్ని అధిగమించడానికి, అవసరమైన వనరులు పొందుపరచడానికి చిరు ధాన్యాల సాగు కీలకమన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ అర్చనారెడ్డి, డాక్టర్ మహేష్, డాక్టర్ సుదర్శన్, డాక్టర్ సాధు, కన్వీనర్ శ్రీకర్ రెడ్డి, కమిటీ సభ్యులు డాక్టర్ నాగేంద్రం, సుచిత్‌కుమార్, బి.సాయి, దివ్య, కె.స్వాతియాదవ్, సుమిత్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు

- విజేత నిజామాబాద్ జిల్లా జట్టు



ట్రోఫీని అందుకుంటున్న నిజామాబాద్ జట్టు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ మైదానంలో రెండు రోజులుగా హనుమకొండ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 10వ రాష్ట్రస్థాయి మహిళా సాఫ్ట్‌బాల్ పోటీలు నిర్వహించగా సోమవారం సాయంత్రం ముగిశాయి. ఈ పోటీల్లో 18 జట్లు పాల్గొన్నాయి. ఇందులో నిజామాబాద్ జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. ద్వితీయ, తృతీయ స్థానాల్లో సిద్దిపేట, హైదరాబాద్ జట్లు నిలిచాయి. పోటీల నిర్వాహకులు, హనుమకొండ జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ సాంబశివరావు, రాష్ట్ర సెక్రటరీ నవీన్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శోభన్‌బాబు, నాగిరెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ నుంచి అబ్జర్వర్ ప్రశాంత్, రామప్ప అకాడమీ చైర్మన్ చంద్రమోహన్ గౌడ్, హనుమకొండ జిల్లా జనరల్ సెక్రటరీ రాజేందర్, రామప్ప గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ డైరెక్టర్లు వంశీకృష్ణ, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు. అతిథులు విజేతలకు ట్రోఫీలను అందజేశారు. అలాగే, సాఫ్ట్‌బాల్ క్రీడలో అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన 17 మందిని నిర్వాహకులు సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ సాంబశివరావు మాట్లాడుతూ తమకు ఇష్టమైన సాఫ్ట్‌బాల్ క్రీడలో రాణించాలని కోరారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించే వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. తెలంగాణా జాయింట్ సెక్రటరీ గంగామోహన్, నిజామామాబాద్ జిల్లా ఒలింపిక్ అబ్జర్వర్ పవన్, తెలంగాణ రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ బాధ్యుడు ఎం.అజీజ్‌ఖాన్ పాల్గొన్నారు. ఈ పోటీల్లో 18 జిల్లాల నుంచి 400 మంది మహిళా క్రీడాకారులు పాల్గొన్నారని నిర్వాహకులు తెలిపారు.

సత్తా చాటిన తెలంగాణ అథ్లెట్లు



400 మీటర్ల పరుగు పందెంలో పరిగెత్తుతున్న మహిళా క్రీడాకారులు



హార్డిల్స్‌పై జంప్ చేస్తున్న క్రీడాకారులు

- గోల్డ్–07, సిల్వర్–08, బ్రాంజ్ –08

హన్మకొండ: అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సహకారంతో హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహిస్తున్న 34వ సౌత్‌జోన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌లో తెలంగాణ అథ్లెట్లు దూసుకెళ్లారు. రెండో రోజు తెలంగాణ సత్తాను చాటుతూ పతకాల పంటను పండించారు. వివిధ విభాగాల్లో పతకాలు సాధించిన క్రీడాకారులు వీరే..

అండర్–14 బాలుర విభాగంలో		
మాధవ	లాంగ్‌జంప్	సిల్వర్
వరుణ్	ట్రైథ్లాన్	గోల్డ్
దీక్షిత్	ట్రైథ్లాన్	సిల్వర్
రాము	600 మీటర్ల పరుగు	గోల్డ్
అండర్–14 బాలికలు		
మనుశ్రీ	లాంగ్‌జంప్	సిల్వర్
ప్రణతి	600 మీటర్ల పరుగు	గోల్డ్
అండర్–16 బాలికలు		
వైష్ణవి	లాంగ్‌జంప్	సిల్వర్
కృష్ణవేణి	జావెలిన్‌త్రో	బ్రాంజ్
వైశాలి	హెక్సాథ్లాన్	గోల్డ్
అండర్–16 బాలుర విభాగంలో		
గోపిచంద్	5కే వాక్	బ్రాంజ్
అజారుద్దీన్	400 మీటర్ల పరుగు	సిల్వర్
దత్తు	లాంగ్‌జంప్	బ్రాంజ్
అండర్–14 బాలుర విభాగంలో..		
పరశురాం	600 మీటర్ల పరుగు	సిల్వర్
అండర్–18 బాలుర విభాగంలో..		
వివేక్‌చంద్ర	110 మీటర్ల హార్డిల్స్	బ్రాంజ్
అండర్–18 బాలికలు		
ప్రణతి	100 మీటర్ల హార్డిల్స్	గోల్డ్
పద్మ	400 మీటర్ల పరుగు	సిల్వర్
సింధు	400 మీటర్ల పరుగు	బ్రాంజ్



పోల్‌వాల్ట్‌లో పాల్గొన్న క్రీడాకారుడు

అండర్–20 బాలుర విభాగంలో..		
రాజ్‌మిశ్రా	10కే మీటర్ల రేస్‌వాక్	గోల్డ్
మజీద్‌పాషా	షాట్‌పుట్	బ్రాంజ్
అండర్–20 బాలికల విభాగంలో..		
ఉమ	3కే మీటర్ల పరుగు	సిల్వర్
టిసధార్	100 మీటర్ల హార్డిల్స్	గోల్డ్
మైథిలీ	40 మీటర్ల పరుగు	బ్రాంజ్
మల్లిక	1500 మీటర్ల రన్నింగ్	బ్రాంజ్

రాష్ట్రాల వారీగా రెండో రోజు ఫలితాలు ..

రాష్ట్రం	గోల్డ్	సిల్వర్	బ్రాంజ్
తమిళనాడు	200	105	32
కర్ణాటక	60	45	14
తెలంగాణ	65	48	16
ఆంధ్రప్రదేశ్	30	24	09
కేరళ	35	18	08
లక్షద్వీప్	15	00	01
పుదుచ్చేరి	05	06	01



షాట్‌పుట్ వేస్తున్న క్రీడాకారిణి

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

■మధ్యతరగతి బడ్జెట్‌లో అన్ని వసతులతో కూడిన DTCP Approved ప్లాట్స్ ఫర్ సేల్. జనగామ – సిద్దిపేట రోడ్, జనగామ. EMI సౌకర్యం కలదు. సెల్: 8184923834. [W-189193]

SERVICES

మీ ఆదాయం, మీ చేతుల్లో

■అందరు ఉన్న స్థితి నుండి ఉన్నత స్థితికి చేరాలనుకునే వారికి శుభవార్త. పార్ట్/ ఫుల్‌టైం పని చేస్తూ నెలకు 50 వేలు పైన సంపాదించుకునే అవకాశం. సంప్ర: 9849440697. [W-1220911]

BUSINESS OFFER

■కంపెనీ ప్రొవైడ్ అన్ని రకముల బిజినెస్, ప్రాపర్టీ, పర్సనల్, అగ్రికల్చర్, టేకోవర్ కొరకు DSA & ఏజెంట్స్ కావలెను. Salary + Commission. ఫోన్: 9990752820. [HA-31102]

WANTED

■GNM నర్సులు, అనుభవం గల Lab టెక్నీషియన్స్ & OT అసిస్టెంట్స్ కావలెను. సంప్ర: గార్డియన్ హాస్పిటల్, ములుగు 'X' రోడ్, వరంగల్. 12 to 2pm. [WA-307]

■Govt (Regd) సంస్థ తరపున Work చేయుటకు సొంత కంప్యూటర్ గలవారు కావలెను. ఇంటి దగ్గరే వర్క్ చేస్తూ 9 to 19K సంపాదించే అవకాశం. సెల్: 8977429273. [W-1220904]

■రామకృష్ణ గ్రూపు (AP No.1) VJA, HYD. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు, ఇంటి / వంట పని, బేబీకేర్ కొరకు వర్కర్స్ కావలెను, భోజనం + వసతి + జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 92814 52828, 92814 52833 [B-1068147]

■త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం జీతం: 18K. Ph: 9640400073, 9848571888. [H-189342]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9010144453
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.